# వెర్రి కేక

ప్రాణం మీద భయం, భవిష్యత్తు మీద ఆశ మనిషికి ఈ భూమ్మీద పడగానే అలవడ్డాయేమో, అందుకే నాకా డ్యూటీ వేసినప్పుడు శరీరం కొద్దిగా జలదరించిన మాట నిజం. కాని, సెక్లోను స్పెషలాఫీసరు, తహశిల్దారు, బి.డి. ఒ., నా భుజంతట్టి ధైర్యం చెబుతున్నప్పుడు కాదన లేకపోయాను.

ముందు జీపులో తహశీల్దారు, సబ్-ఇనస్పెక్టరు, నలుగురు కానిస్టేబుల్సుతో బయలుదేరితే, వెనక జీపులో బి.డి.ఒ. నేను ఇద్దరు అటెండర్లతో బయలుదేరాము. మమ్మల్ని అనుసరిస్తూ వెనుక ఒక లారీ, అందులో అరడజనుమంది కూలివాళ్ళు, అయిదు టన్నుల కట్టెలు, పదీ లీటర్ల సారాయి, అరవై లీటర్ల కిరసనాయిలు, నలభై లీటర్ల పెట్రోలు ఉంది. మా వాహనాలు జి.ఎన్.టి. రోడ్డులోంచిచీలి వేరొక తారురోడ్డుమీద పోసాగాయి.

జీవితాన్ని నాటకరంగంతో పోలుస్తూంటారు చాలామంది. కాని, నాటకానికి, జీవితానికి చాలా తేడా ఉందని మాత్రం నేను ఖచ్చితంగా చెబుతాను. నాటకంలో నటులకు చివరి వరకు జరగబోయేదీ తెలుసు. కాని, జీవితంలో ప్రతి సంఘటనా జరిగేంతవరకు ఆ మనిషికి తెలియదు. కాకపోతే వారంముందు దీపావళికి ఇంటి ముంగిళ్ళకు కట్టిన ఆకుపచ్చని మామిడి తోరణాలతో, రంగురంగుల దీపకాంతులతో, కొత్త గుడ్డలతో, పిండివంటల ఘుమఘుమలతో, టపాకాయల చప్పుళ్ళతో, పిల్లా పెద్దా ఆనందపు కేరింతలతో జరిగిపోయిన కాలం ఇప్పుడు గత రెండు రోజుల

పెనుతుఫానుకు విరిగిపోయిన చెట్లు, కూలిపోయిన ఇండ్లు, తెగిపోయిన చెరువులు, పూడిపోయిన మానవ, పశు కళేబరాలతో దుర్గంధ భూయిష్టంగా ఉంటుందా వాతావరణం ? ఏడుపులు, పెడబొబ్బలకు నిలయమవుతాయా గ్రామాలు ?

ఆలోచనలతో ఉండగానే ముందు జీపు ఆగింది. వెంటనే మా జీపు ఆగింది. మేమిద్దరమూ కిందికి దిగాము. తహశిల్దారు, సబ్ ఇనస్పెక్టరూ కూడా దిగారు. తహశిల్దారు, బి.డి.ఒ. జీపు ముందున్న రోడ్డును పరిశీలిస్తున్నారు.

అక్కడ రోడ్డు కనిపించడంలేదు. రోడ్డుమీద చుట్టూ కిలోమీటరు దూరం వరకు గుర్రపుడెక్క ఆకు ఎక్కడో చెరువుల్లోంచి కొట్టుకొచ్చి మోకాలు ఎత్తున కప్పబడి ఉంది.

తహశిల్దారు నావైపు తిరిగి సుబ్బారెడ్డీ! ఇక్కడనుంచే నీ ప్రయాణం ప్రారంభం. జీవితంలో ఎన్నో సుఖాల్నీ, దుఃఖాల్నీ, సంతోషాల్నీ చూసి ఉంటావు. కాని ఇప్పుడు నీవు చేయబోయే పని సుఖ దుఃఖాలకు అతీతంగా మానవత్వానికి ప్రతీకగా ఉండబోతుంది నీకు ఈ పని కొత్త. మంచిపని కొత్తదనంతోనే ప్రారంభం కావాలి. చెప్పినవన్నీ గుర్తున్నాయి కదా. గో ఎహెడ్. విష్ యు ఆల్ సక్సెస్" అంటూ నా భుజం తట్టాడు.

బి.డి.ఒ. నాకు షేక్‌హాండిచ్చి "సుబ్బారెడ్డీ! నువ్వీ పని విజయవంతంగా నెరవేర్చి మన సమితికి మంచి పేరు తేవాలి" అంటూ వెను తిరిగాడు. తహశిల్దారు కూడా ప్రయాణమయ్యాడు. రెండు జీపులు వెళ్ళిపోయాయి.

మోచేతుల వరకు మడచిన తెల్ల టెరీకాటన్ షర్టు, గిరకల వరకు వదలిన మడత నలగని తెల్లగ్లాస్గో పంచె, ఎడమ చేతికి రిస్టువాచీ, మూతినిండా గుబురు మీసాలతో సన్నగా ఆరడుగుల పొడవు ఉన్న నన్ను

ఈ విలేజి డెవలప్‌మెంటు ఆఫీసరు వెంకటసుబ్బారెడ్డి ఇంత పెద్ద పని చేయగలడా అన్నట్లు అందరూ చూడసాగారు.

నేను ఆ చూపుల్ని లక్ష్యపెట్టక పంచె మోకాళ్ళ వరకు ఎగగట్టి "రండి ఇనస్పెక్టరుగారూ! మనం ఆ కనబడే ఊరికి చేరుకుంటే తప్ప అక్కడి పరిస్థితులు తెలియవు. మనం ముందు నడుద్దాం. వెనక లారీ వస్తుంది" అంటూ నడవసాగాను.

నా పక్కనే నడవసాగాడు సబ్ ఇనస్పెక్టరు. వెనక కానిస్టేబుళ్ళు, కూలివాళ్ళు నడవసాగారు. లారీ చిన్నగా రాసాగింది. మేము ఒకవైపు గుర్రపుడెక్క ఆకుల్లో మోకాళ్ళ వరకు కూరుకుపోతూనే దూరంగా కనిపించే ఒక పల్లెను ఆధారం చేసుకొని ఆ దిశగా నడవసాగాం.

ఓ యాభై గజాలు నడిచిన తరవాత లారీ ఇక కదలనని మొరాయించింది. చక్రాలు గుర్రపుడెక్కల ఆకులమధ్య గిర్రున తిరగసాగాయి తప్ప ముందుకు కదలనన్నాయి. నేను కూలివాళ్ళకు పనిపెట్టాను వాళ్ళు గుర్రపుడెక్క ఆకులు లారీ పోయేందుకు అనువుగా లాగేస్తుంటే, లారీ నెమ్మదిగా ప్రయాణం సాగించింది.

"ఏమయ్యా, కానిస్టేబుల్సా! కాస్త ముందు నడిస్తే ఏం పోయింది" అంటూ అరిచాడు సబ్ ఇనస్పెక్టరు.

మా వెనక ఉన్న కానిస్టేబుల్సులో ఇద్దరు మా ముందు నడవసాగారు.

అందరం మౌనంగా నడుస్తున్నాం. ఇంతలో 'కెవ్వు' మని కేక పెట్టాడు పోలీసు కానిస్టేబులు. ఇద్దరు కానిస్టేబుల్స్ ఒకరినొకరు భయంగా పట్టుకుని ఉన్నారు. మేము దగ్గరకు వెళ్ళిచూశాం.

ఆ దృశ్యం....గుర్రపుడెక్క ఆకుమీద తల కనిపిస్తూ గొంతు వరకు కూరుకుపోయిన స్త్రీ శవం. కళ్ళు తెరుచుకొని ఉన్నాయి. నాలుక పొడవుగా సాగి పళ్ళమధ్య కిందికి వేళ్ళాడుతూ ఉంది. విరబోసుకున్న

జుట్టుతో భయంకరంగా ఉంది. చుట్టూ దుర్గంధం వ్యాపిస్తూంది. మా నాసికాపుటాలకు ఆ దుర్గంధం తగలకుండా మాకు ముందుగా ఏర్పాటుచేసి ఉంచిన మాస్కులను ముఖాలకు కట్టుకున్నాం.

"భయపడకండి" అంటూ వాళ్ళకు ధైర్యంచెప్పి కూలివాళ్ళను పిలిచాను.

వాళ్ళు పరుగెత్తుకుని వచ్చారు. వాళ్ళలో ఒకడు ఆనందంగా "సార్" అన్నాడు లారీవైపు వేలు చూపిస్తూ. "అలాగే" అన్నాను. వాడు పరుగెత్తుకుని వెళ్ళి పది లీటర్ల సారాయితో నిండిఉన్న ప్లాస్టిక్ కాన్ తీసుకుని వచ్చాడు. మనిషికి వందగ్రాముల చొప్పున ఇవ్వమని కానిస్టేబుల్ను హెచ్చరించాను. వాళ్ళు గ్లాసులోకి వంచి అందరికీ అందజేశారు. సారాయి గొంతులో పడగానే కూలీలు రంగంలోకి దిగారు. గబగబా ఒకవైపు నుంచి గుర్రపుడెక్క ఆకును లాగివేయసాగారు. సారాయి తాగందే వాళ్ళు శవాల్ని కదిలించలేరు. అయితే అది ఎక్కువ కాకూడదు. కంట్రోలు తప్పితే అసలు పనిచేయలేరు.

నా గుండె లయ తప్పింది. ఒక శవమే గదా అనుకున్న మా అంచనా తారుమారైంది. అక్కడ పదమూడు శవాలున్నాయి. నగ్నంగా, అర్ధనగ్నంగా ఆడా, మగా మానవదేహాలు ఒకదానిమీద మరొకటి పడి ఉన్నాయి. పెద్ద గుంట కావడంతో కొట్టుకొని వచ్చిన శవాలు అక్కడ సమాధి కాబడ్డాయి. ఎవరో! ఎక్కడివాళ్ళో! ఎక్కడ పుట్టారో! చనిపోయిన తరవాత గుట్టగా ఒకేచోట వచ్చిపడ్డారు. బతికి ఉన్నంతకాలం ఈర్ష్యాద్వేషాలతో ఎలా సతమతమయ్యేరో!

"క్విక్" అంటూ పనివాళ్ళను హెచ్చరించాను.

మొదట ఇద్దరు కూలీలు గుర్రపుడెక్క ఆకులమీద అయిదు అడుగుల వెడల్పున చతురస్రంగా రెండడుగుల ఎత్తు వరకు కట్టెలు పేర్చారు. తరవాత దానిమీద చిక్కగా కిరోసిన్ చల్లారు. తరవాత

ఆరడుగుల పొడవు ఉన్న వెడల్పాటి చెక్క పట్టుకొచ్చారు. నలుగురు కూలీలు గుంటచుట్టూ నిలబడి మెల్లగా ఒక్కో శవాన్ని బయటికి తీసి బల్లమీద పడుకోబెడుతున్నారు. శవాలు కుళ్ళిపోయి ఉన్నాయి. కదిలిస్తే దుర్గంధంతో కంపు కొడుతున్నాయి. కాని సారాయి నిషాలో ఉన్నవాళ్ళను ఆ దుర్గంధం ఏమీ బాధపెట్టడంలేదు. బల్లమీద రెండు శవాలు చేరగానే వాటిని తీసుకెళ్ళి కట్టెలమీద పడుకోబెట్టసాగారు.

సబ్ ఇనస్పెక్టరు కానిస్టేబుళ్ళని పిలిచి రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఊరిని చూపిస్తూ "మీరు వెళ్ళి ఆ గ్రామంలోని వాళ్ళను ఓ అయిదుగురిని పిలుచుకురండి" అన్నాడు.

అప్పుడే మా లారీని, కొత్త మనుషులను చూసి ఇంటి గోడలమీద, చెట్లమీద ఎక్కి విచిత్రంగా, ఆశగా చూస్తున్నారు పల్లెప్రజలు. కాని, అక్కడనుంచి మా దగ్గరకు రావడానికి ఎందుకో భయపడుతున్నారు.

మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన ఆ పని సాయంత్రం నాలుగు గంటలకు పూర్తయింది. అందరినీ కట్టెలమీద పడుకోబెట్టారు. ఇంతలో ఆ గ్రామంలో ధైర్యస్థులనబడే ఓ అయిదుగురిని వెంటబెట్టుకొని వచ్చారు పోలీసులు. వాళ్ళు దగ్గరకొచ్చి ఆ శవాల గుట్టనుచూసి వెర్రికేక పెట్టి పారిపోబోయారు. కాని, పోలీసులు బలవంతాన వాళ్ళని ఆపారు. శరీరం ఉబ్బి, నాలుకలు వెళ్ళుకొచ్చి, కనురెప్పలు తెరచుకొని, వెంట్రుకలు చీకిపోయి, కుళ్ళిపోయిన శవాలను చూసి వాళ్లు భయపడ్డారు.

శవపంచాయితీ పూర్తిచేశాం. శవపంచాయితీలో నాలుగు శవాలను మాత్రమే గుర్తుపట్టగలిగారు పల్లెప్రజలు. మిగతా శవాలకు ఐడెంటిఫికేషన్ దొరకలేదు తరువాత కూలివాళ్లు శవాలపై మరలా ఓ అడుగు ఎత్తున కట్టెలు పేర్చారు. తరువాత టిన్నుతోసహా పెట్రోలును కట్టెలమీద చల్లారు ఒకడు అగ్గిపుల్లగీసి అంటించాడు. చప్పున అంటుకొంది. ఆకాశంలోకి మంటలు లేచాయి. సామూహిక శవదహనం అది.

సాయంత్రం అరుగంటల వరకూ అంటే దాదాపు రెండు గంటలు శవాల్ని కాలుస్తూ ఆ పర్యవేక్షణలోనే ఉన్నాం. చీకటి పడడంతో భయం భయంగా దిక్కులు చూస్తూ వెళ్ళిపోయారు పల్లెప్రజలు. పోలీసువాళ్ళు కూలివాళ్ళ సాయంతో లారీపైన ఎత్తుగా షామియానాతో టాపు కట్టించారు. రెండు పెట్రొమాక్సులైట్లు వెలిగించారు. ఆ వెలుతురులో స్టౌమీద త్రాగ డానికి వేణ్ణీళ్ళు కాచాడొక కానిస్టేబులు. మేము బాగ్‌లో ఉన్న రొట్టెల్ని అందరికీ పంచాం. రొట్టె తిన్న తరువాత మిల్క్‌పౌడరు డబ్బాతీసి టీ కాచి ఇచ్చారు. కార్యక్రమం పూర్తయ్యేంతవరకు ఇక్కడ మా ఆహారం ఇదే. సబ్ ఇనస్పెక్టరు తాను బాడీలోనే ఉంటానని, నన్ను కాబిన్‌లో పడుకోమన్నాడు.

నేను లారీ దిగి కాబిన్‌లో పడుకొన్నాను. అద్దంలోంచి చూసిన నాకు ఇంకా ఎర్రగా మండుతున్న ఆ స్థలంలో ఎన్నో ఆత్మలు ఆ మంట చుట్టూ తిరుగుతూ కరాళనృత్యం చేస్తున్నట్లుగా అనిపించింది. ఆ రాత్రంతా ఎన్నో పీడకలలు. కలల్లో ఎటుచూసినా శవాల గుట్టలు. ఆ గుట్టల మధ్య నేను. ఇలా రాత్రంతా గడిపాను.

## 2

ఉదయం ఎనిమిది గంటలకే మా ప్రయాణం ప్రారంభమయింది. నిన్న మా దగ్గర కొచ్చిన పల్లె వాళ్ళకు మా ప్రయాణం తెలిసి ఉండడంతో ఉదయాన్నే షుమారు పదిహేనుమంది యువకులు మాకు సహాయం చేయడానికి వచ్చారు. అందరూ వాళ్ళకు తెలిసిన మార్గమే కనుక గుర్రపు డెక్క ఆకుల్ని పక్కకు నెట్టివేస్తుంటే లారీ కొంత త్వరగా ముందుకు పోసాగింది.

మాకు ఈసారి కొంత ఉత్సాహం వచ్చింది. కారణం కొంతమంది మాకు తోడున్నారు. దారి పొడవునా దుర్గంధపు వాసనలు వస్తున్నాయి.

కూలీలలో ఇద్దరు లారీ కాబిను పైకి ఎక్కి చుట్టూ చూస్తున్నారు. ఎక్కడయినా శవాలు కనిపిస్తాయేమోనని-మిగతావాళ్ళం నడిచి ఊరి దగ్గర కొచ్చాం.

ఇంతలో ప్రభుత్వపు హెలికాప్టర్ ఆకాశంలో తిరుగుతూ గ్రామం మీదికి కొద్ది ఎత్తులోకి వచ్చింది. ఆ ఊర్లో ఉన్న ఒకేఒక మిద్దె ఇంటి మీద కొన్ని బస్తాల రొట్టెలను వేసి వెళ్ళిపోయింది. మేము ఆ గ్రామంలో తిరగసాగాం.

"మా ఊళ్ళో మూడొందలు జనాభా, సామే. ఇప్పుడు వందమందే జనాభా కనిపిస్తా ఉండరు. ఏమయి పోయిన్రో. "ముఖాన గుద్దేసుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ నా కాళ్ళముందు కూలబడి పోయాడో వృద్ధుడు.

"ఏడవకు తాతా! వాళ్ళు ఎక్కడో ఒకచోట గట్టునపడి బతికే ఉంటారు. నువ్వా దిగులేం పెట్టుకోకు" అన్నాను ధైర్యం చెబుతూ. ఆ పరిస్థితిలో అంతకంటే ఏం ఓదార్చగలం.

"సామే, నిజం చెప్పు. పైన్నుంచి అరు చెరువులు తెగి మా చెరువు మీద పడే. మా చెరువు తెగే. సామే, మీరు చెబితే మాత్రం మా మనుషులు బతికుంటరని నన్నెట్టా నమ్మమంటవ్" అన్నాడు వృద్ధుడు నిలబడే శక్తి లేక కూర్చునే.

నేను ఉత్సాహవంతులయిన కొంతమంది యువకుల్ని టీములుగా నియమించాను. మేము తీసుకొచ్చిన కూలివాళ్ళను ఒక్కో టీముకు ఒకరు లెక్కన జత చేసాను. వాళ్ళు టీములుగా వెళ్ళి గ్రామంలోనూ, పొలాల్లోనూ తిరిగి శవాల్ని, పశుకళేబరాల్ని గుట్టలుగా వేసి వాటిని తగులబెట్టాలి.

కూలిపోయిన ఇండ్ల కప్పులు తొలగించి శవాలను బయటికి తీస్తున్నారు. వాటికి సంబంధించిన వాళ్ళు కేకలుబెట్టి ఏడుస్తున్నారు. ఏడుపులు, గగ్గోళ్ళు సైక్లోను తరువాత మరలా రెండు రోజులకు ప్రారంభ మయ్యాయి.

దొరికిన శవాల్ని కాలుస్తున్నారు. దొరకని మనుషుల కోసం వెతుకుతున్నారు. సాయంత్రం నాలుగింటికి ఊరంతా తిరగడం అయిపోయింది. ఊరికి విసిరేసినట్లుగా కొద్ది దూరంలో ఒక ఇల్లుంది. అది ఎవరిదని అడిగాను. అది పొలాల మీద కాపలాదారుదట. అతనికి అందరూ ఆడపిల్లలేనట. మొత్తం కుటుంబ సభ్యులు ఏడుగురు. ఏమయిపోయుంటారో తెలియదని వాపోయారు గ్రామస్తులు.

అక్కడకు పోవాలంటే మోకాటి లోతు నీళ్ళలో దిగిపోవాలి. మేము అలా దిగి నడుస్తూ పోయాం. తుఫానులో ప్రవాహం ఎక్కువ కావడంతో ఆ ఇంటితో ఊరికి సంబంధాలు తెగిపోయాయి. అది ఒక దిబ్బమీద ఉంది. ఇంటిపక్క ఒకేఒక తాడిచెట్టు ఉంది.

అందరం దిబ్బ ఎక్కి ఇంటిని సమీపించాం. ఇంటికి నాలుగు వైపులా గుంటలు ఒరిగి ఉన్నాయి. ఇంటి గోడలు సగం సగం కూలిపోయి ఉన్నాయి. తొంగిచూశాం. ఇంట్లో కొన్ని శవాలు. శవాలమీద ఒండ్రుమట్టి కప్పబడి కొంతమంది పాదాలు. కొంతమంది తలలు కనిపిస్తున్నాయి. ఇంట్లోకి వెళ్ళాలంటే అటువైపు ఉన్న వాకిలిగుండా రావాలి. అంటే, నీళ్ళలో దిగి ఆ వైపునుంచి రావాలి. కదిలిస్తే ఇల్లు పడిపోయేటట్టుంది. ఇక తప్పదన్నట్లు ఇంటి కప్పుమీద పెట్రోలు చల్లి ఇంటితో సహా అంటించాం.

అప్పుడు జరిగిందో హృదయ విదారక సంఘటన. గుండెల్ని పిండే క్షణాలివి

ఓ నగ్న యువతి మెరుపులా ఇంటికి ఆవలివైపునుంచి పరుగెత్తుకుని వచ్చి తాటిచెట్టు చాటుకు వెళ్ళి నిలబడింది. అందరూ ఆమెను నగ్న యువతిగా గుర్తించారేకాని, ఆమెను ఆపాదమస్తకం చూసిన వాళ్ళెవరూ లేరు. అంత వేగంగా పరుగెత్తింది.

ఆమె తాటిచెట్టు చాటున నిలబడి తల బయటకు పెట్టి, "అన్నా! గుడ్డల్లేవు. నేనెట్లా వచ్చేది" అంది పెద్దగా ఏడుస్తూ.

ఎవరో పాత-చీర తేవటానికి ఊళ్ళోకెళ్ళారు నేను ఉండబట్టలేక బాగ్‌లో ఉన్న గ్లాస్కో పంచెను బయటికి చాచిన ఆమె చేతికి అందించాను. దాన్నే మోకాళ్ళ వరకు, నడుముకు చుట్టుకుని, ఇంకో కొన పైటగా వేసుకుంది.

ఆమె పరుగెత్తుకొని వచ్చి నా కాళ్ళమీద పడి, "అన్నా! ఆ రోజు నీళ్ళు ఇంట్లోకొచ్చినయి. నన్ను మా తమ్ముళ్ళని, చెల్లెళ్ళని మా నాయన అటకమీదెక్కించిండు. నీళ్ళ గోడల్ని దోసుకుని అటకమీదికి ఉరికినయి. అటక కూలి అందరూ చచ్చిపోయిన్రు, నేను మాత్రం బతికినా, అన్నా! ఇక నాకు దిక్కెవరు" అంది ఏడుస్తూ.

చుట్టూ అయిదు శవాల్ని, అందులోనూ తన కుటుంబ సభ్యుల్ని పెట్టుకొని ఈ మూడు రోజులు ఎలా బతికిందో, పగలంతా వాళ్ళని చూసి బాధపడుతూ ఏడుస్తూ రాత్రుళ్ళు చీకటిని చూసి భయపడి ఏడుస్తూ, 'నా' అని పలకరించే దిక్కులేక, కూడూ నీళ్ళూ లేకుండా ఎలా బతికిందో? జాలితో నా మనసు కరిగిపోయింది. ఆమెకు ఒక ఇంట్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేశాను. తదుపరి ఆమెవిషయం ప్రభుత్వానికి తెలియ చేయాలనుకొన్నాను.

## 3

రెండు రోజులు ఆ ఊళ్ళో ఉండి మనుషుల శవాల్ని, జంతు కళేబరాల్ని అగ్నికి ఆహుతి చేసిన తరవాత అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంకో పల్లెకి బయలుదేరాం. కొద్దిమంది గ్రామస్థులు మాతో రావడానికి అంగీకరించారు.

ఊరికి కొద్ది దూరంలో లారీ ఆగిపోయింది. అక్కణ్ణుంచి అందరమూ గెనాలమీద నడవసాగాం. గుర్రపుడెక్క ఆకు పోను పోను పలచన కాసాగింది. చుట్టూ శవాలున్నాయేమో అని చూస్తూ పోతున్నాం. మానవ శరీరాలకంటే, జంతు కళేబరాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఎదురుగా గెనిమ అవతల నుండి తిరగడంవల్ల ఏర్పడిన పెద్ద గుంట. ప్రస్తుతం గుంటలో నీళ్ళు లేవు. అందులో ఒక మనిషి తల వంచుకొని కూర్చుని ఉన్నాడు. నెత్తిన జుట్టు నల్లగా ఉంది. ఎవరయిందీ అర్థం కావటంలేదు.

"ఏయ్ ! ఎవరు నువ్వు ? లెయ్" అన్నాడు కూలీల్లో మాణిక్యం అనేవాడు.

గుంటలోంచి ఎవరూ పలకలేదు. కోపమొచ్చిన మాణిక్యం గుంట దగ్గర కూర్చుని లోపల చెయ్యిపెట్టి ఆ వ్యక్తి గడ్డం పట్టుకుని ముఖం పైకెత్తాడు.

అంతే....

ఒళ్ళు జలదరించింది. ఆ వ్యక్తికి కనుగుడ్లు లేవు. లోతుకుపోయి సొట్టలు పడిపోయి ఉన్నాయి కళ్ళు. తల ఎటు తిప్పితే అటు తిరుగుతోంది. చేతిలోకి ఊడి వచ్చేట్లుగా ఉంది. ఆ మనిషికి శరీరంమీద పంచె మాత్రమే ఉంది.

"ఎవరతను" అంటూ అరిచాను. ఎవరూ పలకలేదు.

"మాకు తెలియదు సామే. పక్కూర్లో వాళ్ళని అడగండి" అన్నాడొకడు.

మనుషుల్ని తీసుకు రమ్మని రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఆ ఊరికి కూలివాళ్ళను పంపాను. కూలివాళ్ళు వాళ్ళెవరూ రావడం లేదని వచ్చి చెప్పారు. మళ్ళీ పోలీసు కానిస్టేబుళ్ళని పంపాను. వాళ్లూ ఎవర్నీ తీసుకురాలేకపోయారు.

"ఏం" అన్నాను.

"అంతా భయపడుతున్నారు సార్. ఎవరూ వచ్చేట్లు లేరు."

"ఇప్పుడు శవపంచాయితీ ఎలా ?" అన్నాడు సబ్ ఇన్స్పెక్టరు.

కొద్దిసేపు ఆలోచించి నేనొక్కడినే బయలుదేరాను. నన్ను చూడగానే ఆ ఊళ్లో వాళ్ళంతా పరుగెత్తి తలుపులు వేసుకొన్నారు.

"ఇప్పుడు మీరు వస్తే సరేసరి, లేకపోతే ఓ అరగంటలో శవానికి తాడుకట్టి లాక్కొచ్చి ఊరి మధ్యలో పడేస్తాను" అంటూ బిగ్గరగా అరిచాను.

"ఓయమ్మో" అంటూ అరిచారు తలుపుల చాటునుంచి. కాని, ఎంత సేపటికి ఎవరూ రాలేదు నేను నిరాశ చేసుకుని వెనుదిరిగాను.

ఓ ఫర్లాంగు దూరం నడిచేసరికి వెనక ఏదో శబ్దమయింది. తిరిగి చూసేసరికి ఓ పదిమంది వస్తూ కనిపించారు. అంటే, నేను పెట్టిన భయం వాళ్ళ విషయంలో బాగా పనిచేసిందన్నమాట అనుకొన్నాను.

అంతా గుంట దగ్గరగా వచ్చారు. ఈ లోపల కూలివాళ్ళ శవాన్ని బయట కూర్చోబెట్టి ఉన్నారు శవం తాలూకు అవయవాలు .నీలుక్కొని ఉండటంతో ఎటు వంచినా వంగడంలేదు.

శవాన్ని చూసి అందరూ "గురువు....గురువు" అంటూ కంగారు పడిపోయారు.

"ఏమిటయ్యా ?"

"ఈయన మా భాగోతం గురువు, సామే. మాకు ఆ రాత్రి చెంచు నాటకం భాగోతం నేర్పుతా ఉండిండు. వర్షం, గాలి పట్టుకొన్నది. అందరం ఎవురిదార్ని ఆళ్ళం పరిగెత్తినం. ఎవురు పెళ్ళాం పిలకాయల్ని ఆళ్ళం చూసుకోవడానికి ఎల్లినం. ముసలి గురువు ఏటయిపోయిందో ఎవురమూ అనుకోలా. ఇప్పుడు సూత్తున్నం" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొన్నారు. వాళ్ళముందే శవదహనం అయిపోయింది.

వాళ్ళవెంట ఆ గ్రామానికి బయలుదేరాం. ఆ ఊరంతా చాలావరకు కొట్టుకుపోయింది. దాదాపు ఇరవై శవాలు పొలాల్లో దొరికాయి. సుమారు యాభై జంతు కళేబరాలు. వాటిని దహనం చేశాం. గుర్తు తెలియకుండా పోయిన వ్యక్తులు మరో ఇరవైమంది. ఆ ఊళ్లో ఆహారం లేక కుక్కల శవాల్ని కుక్కలే పీక్కు తినడం నా కంట తడి పెట్టించింది.

ఒకరోజు సాయంత్రం ఆరు గంటల సమయంలో ఒక కుర్రాడు పరుగెత్తుకు వచ్చాడు.

"సార్.... సార్" అని అరుస్తూ.

"ఏమిటి ?" అన్నాను.

"అదిగో, సార్. ఆ చింతచెట్టుమీద దయ్యం కూర్చుని ఉంది సార్" అన్నాడు చేయి చూపిస్తూ.

"దయ్యమా నీ బొంద !"

"అవును సార్. చింతపూత కోస్తామని ఎక్కాను సార్. అదీ చెట్టుకొమ్మమీద కూర్చుని నావైపు చేయి చూపిస్తూ 'రా....రా' అని పిలుస్తోంది సార్" అన్నాడు భయంగా.

"నిజమే అయ్యుంటుంది సామే ఇంతమంది సచ్చిపొయ్యారు కందా. ఎవురిదో ఒకరి ఆత్మ దయ్యమై తిరుగుతుండొచ్చు సామే" అన్నాడొక ముసలివాడు.

నేను వచ్చి అప్పటికి వారమయింది. నా కిచ్చిన టైము ప్రకారం రెండు ఊళ్ళలోనూ, వాటి పరిసరాల్లోనూ కూలంకషంగా వెదికి శవాలను తగులపెట్టేశాం. ఇంకేం పనిలేదు. అటువంటప్పుడు ఈ దయ్యం అనుమానం కూడా తేల్చుకుంటేపోతుంది. రేపటిదాకా ఉండి టైము వేస్టు చేయడం దేనికి అనుకొన్నాను.

నేను ఇద్దరు కూలీల్ని తీసుకొని బయలుదేరాను. "నువ్వు వెళ్ళొద్దు సామే" అంటూ మా వెనక పదిమంది గ్రామస్థులు బయలుదేరారు.

ఫర్లాంగు దూరంలో ఉన్న ఆ పెద్ద చింతచెట్టును సమీపించాం. నా దగ్గరున్న టార్చిని ఫోకస్‌చేసి చెట్టుకు నాలుగువైపులా ప్రసరింపచేశాను ఉత్తరపువైపు కొమ్మల్లో ఒక కొమ్మమీద ఓ ఆకారం అటొక కాలు, ఇటొక కాలు వేసి కూర్చుని ఉంది. ఒంటిమీద జాకెట్టుంది. నడుము దగ్గరనుంచి గిరకలకు ఓ అడుగు పైవరకు తెల్లలోపావడాతో ఉంది. తల విరబోసుకుని ఉంది. ముఖం ఎండిపోయి వికృతంగా ఉంది. చర్మం ఎముకలకు అతుక్కొనిపోయి, జాకెట్ లూజుగా ఉంది. పాదాలమీద చర్మం ఎండిపోయి, వేళ్ళ గనుపులతో సహా కనిపిస్తున్నాయి.

ఎడమచేయి పై కొమ్మను పట్టుకొని ఉంది. కుడిచేయి కిందికి వేలాడుతూ ఉంది. గాలికి కొమ్మలు పైకి, కిందికి ఊగినప్పుడల్లా అది పిలుస్తున్నట్లుగా కుడిచేయి కదులుతూ ఉంది.

ఆ ఆకారాన్ని చూసి కొంతమంది కెవ్వన కేకేశారు. గుండె దడదడ లాడుతుండగా "సామే....అది దయ్యం. మా బుద్ధి గడ్డితిని వచ్చినం. మేం ఎల్తం బాబో" అంటూ అరిచారు కొందరు.

"ఇది నిజంగా దయ్యం సార్" అన్నాడు కూలీల్లో మాణిక్యం అనేవాడు.

"నోర్మూసుకుని నువ్వు ముందు చెట్టెక్కరా" అన్నాను.

వాడు రెండు బారలు చెట్టుమీదికి పాకి కొమ్మజారి కిందపడ్డాడు. ఇంకో కూలీ ఎక్కసాగాడు.

"నాను బయపడతుండ ననుకొంటుండరా" అంటూ మాణిక్యం పౌరుషంగాలేచి తనూ చెట్టు పైకెక్కసాగాడు.

ఇద్దరూ కలిసి ఆ ఆకారాన్ని కిందికి తెచ్చారు. అదో స్త్రీ శవం.

వారం రోజులుగా గాలికి, ఎండకు వరడు గట్టుకుపోయింది. శవం కిందికి దించేప్పుడు గ్రామస్థులు పత్తాలేకుండా వెళ్ళిపోయారు. మాణిక్యం 'సీసా లోని మరో వంద గ్రాములు సారాయి తాగి శవాన్ని భుజాలమీదకు ఎక్కించుకుని తేలిగ్గా గ్రామంలోకి వచ్చాడు.

అందరూ శవాన్ని చూసి పారిపోయారు. కాని, వారిలో ఒకడు అనుమానంగా వెనక్కు తిరిగి వచ్చి "ఒరే.... ఈ మనిషి పాపమ్మరో" అంటూ అరిచాడు.

"ఆఁ!.... పాపమ్మా" అంటూ ఓ ఇరవైమంది వెనక్కు పరుగెత్తుకుని వచ్చారు.

"ఆఁ!....పాపమ్మే. అదుగో చుక్కల రయిక" అన్నాడు మొదటి వాడు.

"ఓ....పడమటి వీధి పాపమ్మా! నువ్వెందుకు చచ్చిపోయావమ్మా! దేవుడికి నీ మీద దయలేదంటమ్మా" అంటూ ఏడ్చారు.

అందరూ ఈమెను చూసి ఇంత ప్రత్యేకంగా బాధపడుతూ ఉంటే నాకు ఆశ్చర్యంగా ఉంది.

నా అనుమానం గమనించి "సామే! పాపమ్మ ఎంత త్యాగం చేసింది! ఆ మిద్దెక్కి చీరవిప్పి పక్కనే ఉన్న టెంకాయ చెట్టుకి ఒక కొనగట్టి, రెండో కొన నీళ్ళలో ఏసి కొట్టుకుపోయేవోళ్ళకు అందించి దాదాపు ఇరవైమందిని లాగింది. సివరకు మాయదారి దేవుడు ఆమెనే ఎత్తుకుపోయిండు" అంటూ ఏడ్చాడో ముసలివాడు. అంటే, ఆమె పట్టు తప్పి ప్రవాహంలో కొట్టుకుపోయి చెట్టుకొమ్మల మధ్య చిక్కుకుందన్న మాట.

ఇదీ నాకు తారసపడ్డ ఆఖరు హృదయవిదారక సంఘటన.

ఆ శవాన్ని కూడా దహనం చేశాం.

వాళ్ళు వద్దంటున్నా వినకుండా ఆ రాత్రే తిరుగు ప్రయాణం మొదలుపెట్టాం. ఆ ఊరునుంచి రెండు కిలోమీటర్లు వచ్చామో లేదో లారీ కీచుమంటూ ఆగిపోయింది. "సార్ ! లారీ ఇంజనుట్రబుల్" అంటూ డ్రైవరు పైనుముక్క కాల్చి ఆ వెలుతురులో ఇంజన్ బాయినెట్ తెరిచి చూడసాగాడు.

నేను కాబిన్‌లోంచి బయటకువచ్చి లారీ బాడీలో ఎక్కి నలు దిశలా చూశాను. చుట్టూ గాఢాంధకారం. ఆ చీకటి రాత్రిలో నా మనసులో కాస్తంత వెలుతురు.

నేను ఇంతవరకు నా భుజాలపై మోపిన ఎంతో విలువైన కార్యాన్ని నిర్విఘ్నంగా జరిపాను. తుఫాను బాధితులకు డబ్బు లివ్వడం, బట్టలివ్వడం, ఇండ్లు కట్టించడం గొప్పకాదు. శవాల్ని వెతికి వాటికి దహన సంస్కారాలు చేయడం అత్యంత అమూల్యమైనది. పుట్టడం ఎంత సహజమో, చావడం కూడా అంతే. కాని, ఈ అసహజమైన చావుకు ఎన్ని ఆత్మలు ఘోషపెడుతున్నాయో !

ఆ నిశ్శబ్ద నిశీధిలో శవాలు తిని బలిసిన నక్కలు పెద్దగా ఊళలు వేస్తున్నాయి. గ్రామాల్లోని కుక్కలు గుంపులుగా చేరి "గో" అని అరుస్తు న్నాయి. ఎక్కడో పెద్దగా స్త్రీ ఆర్తనాదం. గతస్మృతులు తట్టుకోలేక పెట్టిన హృదయ విదారకమైన వెర్రికేక అది.

**